సాక్షి
సిద్దిపేట
శనివారం । 3 । ఫిబ్రవరి । 2024




అరకొర రైళ్లు.. అవస్థలు

రైల్వే సదుపాయాలను ప్రయాణికులు ఉపయోగించుకుంటున్నా అందుకు అనుగుణంగా సేవలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వివరాలు 8లో ▸



గుడుంబా స్థావరాలపై..

నాటుసారా సరఫరా, గుడుంబా తయారీ చేసే వారు ఎవరైనా వదిలిపెట్టబోమని, పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ సీఐ పవన్ హెచ్చరించారు. వివరాలు 8లో ▸



అధ్వాన రోడ్డుతో తిప్పలు

గజ్వేల్ మండలంలో రోడ్లు అధ్వానంగా మారాయి. గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

త్రిపుర గవర్నర్‌కు సన్మానం



గవర్నర్ ఇంద్రాసేనారెడ్డిని సన్మానించిన బీజేపీ నాయకులు

సాక్షి, సిద్దిపేట: జిల్లా కేంద్రానికి శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి వచ్చారు. జగిత్యాలకు వెళ్తున్న క్రమంలో సిద్దిపేటకు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు రాంచంద్రారెడ్డి ఇంటికి వచ్చి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ సీనియర్ నాయకులు గవర్నర్‌ను సన్మానించారు. వారితో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో నార్త్‌ఈస్ట్ రాష్ట్రాలను సెవన్ సిస్టర్స్ అనేవారని, ఇప్పుడు సిక్కింతో కలిసి అష్టలక్ష్మీ రాష్ట్రాలు అంటున్నారన్నారు. ఆగర్తల ప్రాంతం విద్యా హబ్‌గా విరాజిల్లుతోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి సిటీ పోలీస్ యాక్టు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం నుంచి సిటీ పోలీస్‌యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 18వ తేదీ వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ సమయంలో ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. వీటి నిర్వహణకు పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు.

పుస్తక సమీక్షలో విద్యార్థిని ప్రతిభ



ధనలక్ష్మి

సిద్దిపేటరూరల్: ఖమ్మంలో నిర్వహించిన జాతీయ స్థాయి పుస్తక సమీక్షల పోటీలో విద్యార్థిని సత్తా చాటింది. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ధనలక్ష్మి విజేతగా నిలిచిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షౌకత్ అలీ శుక్రవారం తెలిపారు. ఈ పోటీలో 200 మంది పాల్గొన్నప్పటికీ ధనలక్ష్మి రాసిన 'రామ సక్కని గాలిపటం 'అనే బాలల కథల పుస్తకంపై సమీక్ష రాసి విజేతగా గెలుపొందడం సంతోషంగా ఉందన్నారు. ధనలక్ష్మిని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

యూరియా కొరత రావొద్దు


జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



కోహెడలోని ఫెర్టిలైజర్ షాపులో స్టాక్ రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ

కోహెడ(హుస్నాబాద్): లైసెన్స్ కలిగిన ప్రతి ఫెర్టిలైజర్ షాపు డీలర్ పది టన్నుల యూరియా స్టాక్‌కు తగ్గకుండా నిల్వ ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్, ప్యాక్స్, గ్రోమోర్, అశ్విని ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. బిల్‌బుక్స్, స్టాక్ బుక్స్ షాపులలో అందుబాటులో ఉంచాలన్నారు. యూరియా కొరత రావొద్దన్నారు. అంతకు ముందు వరి సాగు పై క్షేత్రపరిశీలన చేశారు. కార్యక్రమంలో ఏఓ భోగేశ్వర్, ఏఈఓ శివకుమార్, రూప, మహిపాల్, షాపు డీలర్ చొక్కారావు కోహెడ ప్యాక్స్ సీఈఓ మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రం తనిఖీ



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ సూర్య ప్రకాశ్

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాన్ని డీఐఈఓ (ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాధికారి) సూర్యప్రకాశ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణతో పాటు, పరీక్షలకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థులను వార్షిక పరీక్షల కోసం సన్నద్ధం చేయాలని లెక్చరర్లను ఆదేశించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులందరూ ఈ నెల 16న జరిగే ఇంగ్లిష్ ప్రాక్టికల్ ఎగ్జామ్స్‌కు హాజరై ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీనివాస్ ఉన్నారు.

కాలుష్యం నివారిద్దాం.. పర్యావరణం రక్షిద్దాం

ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం

చిత్తడి నేలల విధ్వంసంతో పర్యావరణంలో మార్పులు చోటుచేసుకుని, దుష్పరిణామాలు అధికమవుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు పాలకులు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని కోరారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ చిత్తడినేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జంతు, మత్స్యశాస్త్ర విభాగాల అధిపతి డాక్టర్ అయోధ్యరెడ్డి మాట్లాడుతూ కాలుష్యాన్ని నివారించేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మామిడాల శ్రీనివాస్, కె. విశ్వనాథం, డాక్టర్ పుణ్యమ్మ, డాక్టర్ జగదీశ్వరాచారి, చక్రవర్తి, రాంకుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

– సిద్దిపేటఎడ్యుకేషన్



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

దళితబంధు చిచ్చు

గులాబీ దళంలో గుబులు

- బీఆర్ఎస్ లీడర్ల డబ్బు వసూళ్లే కారణం
- తిరిగి ఇవ్వకపోవడంతో రోడ్డెక్కుతున్న బాధితులు
- పలు చోట్ల పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు

మద్దూరు మండలం నర్సాయిపల్లికి చెందిన ముత్యాల కిషన్, చిలుక ప్రశాంత్‌లకు దళిత బంధు ఇప్పిస్తానని స్థానిక మండల ప్రజాప్రతినిధి ఒక్కొక్కరి నుంచి రూ. లక్ష చొప్పున వసూలు చేశారు. దళిత బంధు ఇప్పించకపోగా, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే కులం పేరుతో దూషించారని పోలీస్‌స్టేషన్‌లో బాధితులు స్థానిక ఎంపీపీ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేశారు. దీంతో జనవరి 9న ఎస్సీ ఎస్టీ కేసును పోలీసులు నమోదు చేశారు.

మద్దూరు మండలం తోర్నాల గ్రామానికి చెందిన ఆరుగురికి దళిత బంధు ఇప్పిస్తానని అదే గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి రూ.6లక్షలు వసూలు చేశారు. మంజూరు కాకపోవడం.. డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో గత నెల 30న సదరు ప్రజాప్రతినిధి ఇంటి ఎదుట బాధితులు నిరసన తెలిపారు.

కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్‌కు చెందిన దాసరి పరశురాములు నుంచి రూ.1.5లక్షలు ఎంపీపీ భర్త కిషన్, డ్రైవర్ సురేశ్ తీసుకున్నారు. దళిత బంధు రాకపోవడం.. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు డిసెంబర్24న కేసు నమోదు చేశారు.



మద్దూరు మండలం తొర్నాలలో ప్రజాప్రతినిధి ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: ఇలా.. దళిత బంధు ఇప్పిస్తామని చెప్పి దళితుల నుంచి డబ్బులు వసూలు చేసిన కొందరు గులాబీ లీడర్లకు ప్రస్తుతం గుబులు పట్టుకుంది. మొదటి విడతలో లబ్ధిదారులకు ఆర్థిక సాయం చేయగా రెండో విడత కోసం జాబితాను సిద్ధం చేస్తుండగా ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. దళిత బంధు ఇప్పిస్తామని తీసుకున్న బీఆర్ఎస్ నాయకులు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు ఒక్కొక్కరు రోడ్డెక్కుతున్నారు. పలువురు పోలీస్ స్టేషన్‌లలో సైతం ఫిర్యాదులు చేస్తున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి దళిత బంధు పథకం తీసుకువచ్చింది. ప్రతి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే సిఫార్సుతో మొదటి విడతలో 100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. జిల్లా వ్యాప్తంగా 496 మందికి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం చేశారు. రెండో విడత అమలుకు సైతం సిద్ధం చేసి కొంత బడ్జెట్‌ను సైతం మంజూరు చేసింది. ఒక్కో నియోజకవర్గానికి 1100 మందికి ఇచ్చేందుకు కసరత్తును ప్రారంభించింది. ఎన్నికల కోడ్ రాకముందు 210 దరఖాస్తులు గత ఎమ్మెల్యేల సిఫార్సుతో ఎస్సీ కార్పొరేషన్‌కు వచ్చాయి. ఒక్కో లబ్ధిదారునికి మొదటి విడతలో రూ.3లక్షలు అందించాలని నిర్ణయించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ఆ ప్రక్రియను నిలిపివేశారు.

లోకల్ లీడర్ల చేతివాటం

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పలువురు బీఆర్ఎస్ లీడర్లు తమ చేతివాటం ప్రదర్శించారు. ఒక్కో లబ్ధిదారుని దగ్గర రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు వసులు చేసినట్లు సమాచారం. దళిత బంధు వస్తే ఆర్థికంగా చేయూత అందుతుందని ఉద్దేశ్యంతో పలువురు దళితులు డబ్బులు ఇచ్చారు. తీరా బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో దళిత బంధు పథకం నిలిచిపోయింది. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని బీఆర్ఎస్ లీడర్ల ఇంటికి తిరుగుతున్నారు. అయినా ఇవ్వకపోవడంతో బాధితులు రోడ్డెక్కుతున్నారు. లీడర్లకు ఇచ్చిన డబ్బులు అడిగితే దళితులను దూషిస్తున్నారు. దీంతో పలువురు బాధితులు పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదులు సైతం చేస్తున్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ ముఖ్యనాయకులు దృష్టి సారించి డబ్బులు వసులు చేసిన నేతల నుంచి తిరిగి ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

రూ.100 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణాలు

మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హుస్నాబాద్: నియోజకవర్గంలో రూ.100 కోట్ల వ్యయంతో నాలుగు ఆర్అండ్‌బీ రోడ్లు నిర్మిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు నిధుల మంజూరుకు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని కోరినట్లు పొన్నం తెలిపారు. హుస్నాబాద్ నుంచి రామవరం వరకు 11.5 కి.మీ. దూరానికి రూ.25కోట్లు, అంతకపేట నుంచి కొత్తకొండ వరకు రూ.25కోట్లతో 10 కి.మీ., గన్నెరువరం నుంచి బెజ్జంకి వరకు 10 కి.మీ. రూ.25కోట్లు, రాంనగర్ తండా నుంచి మడిపల్లి క్రాస్ వరకు 10 కి.మీ. రూ.25కోట్ల వ్యయంతో నిర్మించబోయే ఆర్అండ్‌బీ రోడ్లకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు మంత్రి పొన్నం తెలిపారు.

కమీషన్ల కక్కుర్తి వల్లే కాళేశ్వరంలో అక్రమాలు



గోదావరి జలాలకు పూజలు చేస్తున్న నర్సారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు, (ఇన్‌సెట్‌లో) నీరు విడుదల

పనుల్లో నాణ్యతాలోపాలు

- సరిచేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం
- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి
- కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలు విడుదల

గజ్వేల్: రైతుల సంక్షేమంపై బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి లేదని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో కమీషన్ల కోసం కక్కుర్తి పడటంతో కాళేశ్వరంలో భారీగా అక్రమాలు జరిగాయని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యతా లోపాలన్నీ వెగులు చూస్తున్నాయన్నారు.

గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద కొండపోచమ్మసాగర్‌కు వెళ్లే కాల్వ నుంచి కూడవెల్లి వాగులోకి దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి గోదావరి జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ విధానాలపై ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్ హయాంలోనే ప్రాణహిత–చేవెళ్ల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రతి అభివృద్ధి పనిలో కమీషన్లు తీసుకున్నారన్నారు. బీఆర్ఎస్ అక్రమాలకు కాళేశ్వరం ప్రాజెక్టులు కుంగడమే ఇందుకు నిదర్శనమన్నారు. కొడకండ్లలో కూడవెల్లి వాగులోకి నీటిని వదిలే రెండు గేట్లలో ఒకటి మాత్రమే సక్రమంగా పనిచేస్తుందని చెప్పారు. లోపాలను సరిచేసి రైతులకు సమర్థంగా సాగునీటిని అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం తాము కూడవెల్లి వాగులోకి వదులుతున్న గోదావరి జలాలు వాగు పరీవాహక ప్రాంతంలోని చెక్‌డ్యామ్‌లను నింపుతూ మానేరు డ్యామ్ వరకు వెళ్తాయన్నారు. రైతుల పంటలు దెబ్బ తినకూడదన్న ఉద్దేశంతో గోదావరి జలాలలను వదులుతున్నామన్నారు.

బీఆర్ఎస్ వారివి దొంగ ధర్నాలు

దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలు దొంగ ధర్నాలు చేయిస్తున్నారని మండిపడ్డారు. రైతుల క్షేమం తమకు తెలుసునని, వారితో చెప్పించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వంపై ఇష్టానుసారంగా విమర్శలు చేస్తే సహించేదిలేదని, ఎక్కడికక్కడా బీఆర్ఎస్ నేతలను నిలదీస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణంలో అవినీతిని వెలికితీసి కారకులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ఎస్ఈ వేణు, టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, గజ్వేల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, ప్రజ్ఞాపూర్ వెంకట్రామ్‌రెడ్డి, మొన గారి రాజు, అంజీ యాదవ్‌తో పాటు గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సేవలు అభినందనీయం



సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను సన్మానించిన ఎమ్మెల్సీ

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్: గ్రామాల్లో సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు ఐదేళ్లపాటు ప్రజలకు ఎనలేని సేవలందించి గుర్తింపు పొందారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో స్థానిక జెడ్పీటీసీ మల్లేశం ఆధ్వర్యంలో పదవీకాలాన్ని పూర్తిచేసుకున్న సర్పంచ్‌లకు, ఉపసర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం జరిగింది. యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్‌లుగా పనిచేయడం అభినందనీయమన్నారు. ఇంతటితోనే తమ బాధ్యత తీరిపోయిందని భావించకుండా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందించాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమైందని అన్నారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా స్థాయి చెకుముకి (సైన్స్ టాలెంట్) పోటీలు శనివారం ప్రజ్ఞాపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు మండల విద్యాధికారి కార్యాలయ ఆవరణలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక సభ్యులు మాట్లాడుతూ ప్రజ్ఞాపూర్‌లో ఉదయం 10గంటలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులు ఈ నెల 9, 10, 11న జనగామ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.

రోజూ ఎఫ్‌ఆర్ఎస్ నమోదు చేయండి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పాఠశాల విద్యార్థులకు సంబంధించి రోజూ ఎఫ్‌ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజ్ సిస్టం)లో నమోదు చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్‌లో జరిగిన చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట మండలాల సబ్ డివిజనల్ హెచ్ఎంల రివ్యూ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతి (ఎఫ్ఎల్ఎస్) ప్రోగ్రాంలను ప్రతి పాఠశాలలో వంద శాతం నిర్వహించాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో ఎఫ్‌ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరును యాప్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్, ఎంఈఓ ఎం.నర్సింహారెడ్డి, ఎంఎన్‌ఓలు కిష్టయ్య, మీనాంజనేయులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు , సీఆర్పీలు పాల్గొన్నారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుదాం

హుస్నాబాద్: పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుదామని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్విజ్ టాలెంట్ టెస్ట్, అబాకస్ , మోటివేషన్ క్లాసులు నిర్వహించడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కష్టపడి చదవాలి.. పది జీపీఏ సాధించాలి

- వసతి గృహాల్లోని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం
- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటఎడ్యుకేషన్: విద్యార్థులు క్రమం తప్పకుండా చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి చదువుతున్న హాస్టల్ విద్యార్థులకు ప్రేరణ–శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యంగా వసతి గృహాల్లో ఉండి చదువుతున్న విద్యార్థులపై వార్డెన్లు మరింత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పదవ తరగతిలో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత మాత్రమే కాకుండా 10 జీపీఏ సాధించేలా కష్టపడి చదవాలని సూచించారు. ఏ చిన్న ఉద్యోగానికైనా గట్టి పునాది ఈ పదవ తరగతి మాత్రమేనని చెప్పారు. విద్యార్థులు ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా అర్థం చేసుకొని చదివాలి. గణితం, ఆంగ్లం లాంటి సబ్జెక్టులపై గట్టి పట్టు సాధించాలి. గణితంపై పిల్లలకు మంచి మంచి ఉదాహరణలతో ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్, సిద్దిపేట గజ్వేల్ సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు రాజు, సత్యనారాయణ, మానసిక శాస్త్ర నిపుణులు మామిడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' అమలు భేష్..

సిద్దిపేటరూరల్: చిన్నగుండవెల్లిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు బాగున్నాయని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. శుక్రవారం చిన్నగుండవెల్లిలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో ఉపాధి హామీ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఎక్కడ పని ఉన్నా అందరూ పాల్గొనేలా చూడాలన్నారు. వంద రోజులు పూర్తి చేసుకున్నవారికి త్వరలో మరింత ఉపాధి కల్పించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ జయదేవ్‌ఆర్యా, ఎంపీడీఓ కుమారస్వామి, ఎంపీఓ హరి, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు, రేపు రాష్ట్రస్థాయి పోటీలు


క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

తూప్రాన్: నేడు, రేపు 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ బాలికల పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీ కోడిప్యాక నారాయణ గుప్త శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆర్నాల్డ్ పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని సుమారు 20 జిల్లాల నుంచి బాలికల జట్లు పాల్గొంటాయని తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, నలంద జూనియర్ కళాశాలలో వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న నారాయణ, లక్ష్మీనివాస్

చిన్నశంకరంపేట(మెదక్): పర్యావరణ మేలుకు విద్యార్థులు ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటాలని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ కోరారు. శుక్రవారం నార్సింగి మండల కేంద్రంలోని కే.నారాయణ మెమోరియల్ కాలేజీ ఆవరణలో ప్రిన్సిపాల్ కేశవ్ నారాయణ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సమూల మార్పులు తీసుకొచ్చే శక్తి విద్యార్థుల్లో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ నివాస గృహాల వద్ద, వ్యవసాయ క్షేత్రాల వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. సమావేశంలో టీఎస్ఎస్ఓ సభ్యులు రాము, సుజిత్ కుమార్, శైలజ, కృష్ణవేణి, లత, శిరీష, ఐశ్వర్య, మమత, స్వర్ణలత, శిరీష, జయరాజ్ పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

గజ్వేల్‌రూరల్: కుటుంబ కలహాలతో వృద్ధుడు ఉరి వేసుకొని ఆత్యహత్యకు పాల్పడిన ఘటన మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో చోటు చేసుకుంది. శుక్రవారం గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌కు చెందిన ఐలపురం సత్తయ్య(60)కు భార్య కనకవ్వతో పాటు కొడుకు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. సత్తయ్య తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయంతోపాటు కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనకు గురైన సత్తయ్య మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ కలహాలతో గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.10 లక్షల సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్ : సైబర్ మోసగాడి బారిన పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి డబ్బులు పోగొట్టుకున్న ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సదా నాగరాజు కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సుజనా లక్ష్మీనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి డిసెంబర్ 15వ తేదీన షేర్ మార్కెట్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. ఆ ఉద్యోగి తన వివరాలను నమోదు చేశాడు. అనంతరం అపరిచిత వ్యక్తి అతడికి ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. బాధితుడు ఐడీ ఆధారంగా షేర్ మార్కెట్ లో పలు దఫాలుగా రూ.10 లక్షల 30 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదుతోపాటు షేర్‌లో పెరిగిన నగదును తిరిగి ఇవ్వాలని అడుగడంతో,అపరిచిత వ్యక్తి స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అరకొర రైళ్లు.. అవస్థలు

రైల్వే సదుపాయాలను ప్రయాణికులు ఉపయోగించుకుంటున్నా అందుకు అనుగుణంగా సేవలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వందలాది ప్రయాణించే జహీరాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వే సదుపాయం అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. ఇక్కడి నుంచి పని నిమిత్తం ఎంతో మంది నిత్యం హైదరాబాద్‌కు వెళ్తుంటారు. కానీ సరైన రైలు సదుపాయం లేక బస్సుల్లో వెళ్తున్నారు. అలాగే తిరుపతికి వెళ్లే రైలు, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ ఆపడం లేదు. దీంతో ప్రయాణికులు రైల్వే అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- జహీరాబాద్


జహీరాబాద్ రైల్వే స్టేషన్

- జహీరాబాద్‌లో హాల్ట్ ఇవ్వని తిరుపతి రైలు
- కోహీర్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు
- బీదర్ వరకే పరిమితమైన ముంబయి రైలు
- హైదరాబాద్ నుంచి ఇంటర్‌సిటీ నడపాలని వినతి
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

పూర్ణ నుంచి జహీరాబాద్ మీదుగా నిత్యం సాయంత్రం 5.10 గంటలకు తిరుపతి వెళ్లే రైలుకు జహీరాబాద్‌లో హాల్ట్ ఇవ్వకపోవడంతో ప్రయాణికులకు ఉపయోగం లేకుండాపోతోంది. తిరుపతి వెళ్లాలనుకునే వారు హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి తిరుపతికి వెళ్తున్నారు. ఇదే రైలుకు జహీరాబాద్‌కు దగ్గరలో ఉన్న వికారాబాద్ జిల్లాలోని మర్పల్లి గ్రామ పంచాయతీ స్టేషన్‌కు హాల్ట్ ఇచ్చారు. పెద్ద వ్యాపార కేంద్రంగా ఉన్న జహీరాబాద్ స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వక పోగా చిన్న గ్రామమైన మర్పల్లికి ఇవ్వడం విడ్డూరంగా ఉందని ప్రయాణికులు వాపోతున్నారు.

జహీరాబాద్ వరకు పొడిగించాలి

జహీరాబాద్‌కు దగ్గరలోని బీదర్ నుంచి ముంబయికి ప్రతిరోజూ ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నారు. బీదర్ నుంచి రాత్రి 7.45 గంటలకు బయలు దేరుతుంది. బీదర్‌కు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న జహీరాబాద్ వరకు పొడిగించినట్లయితే ఎంతో సౌకర్యంగా ఉంటుందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని రైల్వే శాఖ పరిశీలించాలని కోరుతున్నారు.

ఇంటర్‌సిటీతో మేలు..

హైదరాబాద్ నుంచి జహీరాబాద్, బీదర్ ప్రయాణం చేసేందుకు వీలుగా రైలు సదుపాయం అందుబాటులో లేదు. దీంతో ప్రయాణికులు బస్సులనే ఆశ్రయిస్తున్నారు. బీదర్ నుంచి జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు మాత్రం ఉదయం 6.15 గంటలకు ఇంటర్‌సిటీ రైలును నడుపుతున్నారు. ఈ రైలు ప్రయాణీకుల రద్దీతో ఉంటోంది. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి ఇంటర్‌సిటీ రైలును జహీరాబాద్‌కు నడిపి, అదే రైలు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయితే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు

మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న కోహీర్ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపకపోవడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వెళ్లే ఇంటర్‌సిటీ రైలును మాత్రమే నిలుపుతున్నారు. మన్మాడ్, బెంగుళూరు, పూర్ణ, షిర్డీ, కాకినాడ ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు మాత్రం హాల్ట్ ఇవ్వలేదు. గతంలో పలు మార్లు కేంద్ర మంత్రులను కోరినా ఫలితం లేకుండా పోయిందని కోహీర్ పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులతో చర్చిస్తాం



రైల్వే సదుపాయాల విషయమై ఎంపీ బీబీ పాటిల్ దృష్టికి తీసుకెళ్తాను. సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి చర్చిస్తాను. తిరుపతి రైలును జహీరాబాద్ స్టేషన్‌లో ఆగే విధంగా చూడాలని కోరుతాను. ముంబాయి రైలును పొడిగించాల్సిన అవసరాన్ని, ఇంటర్‌సిటీ రైలును నడపాల్సిన ఆవశ్యకత, కోహీర్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాల్సిన విషయాలను విన్నవిస్తాను. డివిజనల్ రైల్వే బోర్డు మీటింగ్‌లో సైతం ప్రతిపాదిస్తాను.

– షేక్ ఫరీద్, డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్, జహీరాబాద్

ఆధునిక పద్ధతులే మేలు

కొడిపల్లి(నర్సాపూర్): ఆధునిక వ్యవసాయ పద్ధతులతో రైతులకు మేలు జరుగుతుందని, శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞానజ్యోతి అడ్వైజరీ కమిటీ చైర్మన్ అచ్యుత రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం కొడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్ డి. రామానాయుడు విజ్ఞాన జ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థలో ఆరునెలల ఉచిత వ్యవసాయ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులు వ్యవసాయంలో మెలకువలు, ఆధునిక పద్ధతులు, చీడపీడల నివారణ, తక్కువ ఖర్చు, తక్కువ నీటితో అన్నిరకాల పంటల్లో అధిక దిగుబడి సాధించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చిన 30 మంది విద్యార్థులు బుక్స్, స్టడీ మెటీరియల్, దుస్తులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆరు నెలలపాటు వసతి భోజనంతో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి డైరెక్టర్ అర్జునరావ్, ఫీల్డ్ కోఆర్డినేటర్ జగదీష్, కేవీకే శాస్త్రవేత్తలు రవికుమార్, శ్రీకాంత్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.


స్టడీమెటీరియల్ అందజేస్తున్న రాంప్రసాద్

అరటి తోట దహనం!

రూ.12 లక్షల మేర నష్టం

కోహీర్(జహీరాబాద్): గుర్తు తెలియని దుండగులు అరటి తోటను తగులబెట్టిన ఘటన మండలంలోని బిలాల్‌పూర్ గ్రామ శివారులో చోటు చేసుకొంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన రాచప్ప కుటుంబ సభ్యులంతా గ్రామ శివారులో వారికున్న ఐదు ఎకరాల్లో అరటి తోట సాగు చేస్తున్నారు. ఈ భూమిపై కన్నుపడిన రాజవర్ధన్‌రెడ్డితోపాటు మరో ముగ్గురు అరటితోట చుట్టూ ఉన్న పొలాలు కొనుగోలు చేశారు. తోటను కూడా కబ్జా చేసుకొని దారి లేదంటూ యజమాని రాచప్పను వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీంతో సకాలంలో పంటకు నీరందక పొడైపోయింది. ఈ క్రమంలోనే రాచప్ప మనస్తాపానిక గురై అనారోగ్యంతో మంచాన పడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి కుటుంబ సభ్యులు అక్కడే ఉండడంతో బుధవారం సాయంత్రం అరటి తోట తగలబడింది. తోటతో పాటు డ్రిప్పు పైపులు, పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అక్రమ దారిలో కొనుగోలు చేయాలని ప్రయత్నిస్తున్న వ్యక్తులే తోటకు నిప్పు పెట్టి ఉంటారని, సుమారు రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, శుక్రవారం కోహీర్ పోలీసులకు, తహసీల్దార్‌కు బాధిత రైతు కుమారుడు ఈశ్వరయ్య ఫిర్యాదు చేశారు. వెంటనే వారిని అరెస్ట్ చేయాలని కోరారు.


కాలిపోయిన అరటి తోటలో రైతు రాచప్ప

స్నానానికి వెళ్లి.. ప్రాజెక్ట్‌లో మునక

ఏడుపాయల్లో యువకుడు మృతి


శ్రీకాంత్ (ఫైల్)


పాపన్నపేట(మెదక్): ప్రమాదవశాత్తు నీటిలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన పాపన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామానికి చెందిన పల్లె శ్రీకాంత్ (20) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం అదే గ్రామానికి చెందిన మిత్రుడు హరీశ్‌తో కలిసి ఏడుపాయలకు వచ్చాడు. సాయంత్రం ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్దకు స్నానం చేయడానికి వెళ్లి శ్రీకాంత్ నీట మునిగాడు. ఈ విషయమై హరీశ్ శ్రీకాంత్ కుటుంబీకులతోపాటు గ్రామస్తులకు సమాచారం అందజేశాడు. ఉదయం గజ ఈతగాళ్లు గాలించగా శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది. మృతుని తండ్రి పోశెట్టి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ మద్యం పట్టివేత

చిలప్‌చెడ్(నర్సాపూర్): అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన చిలప్‌చెడ్ మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ షేక్‌మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్కూల్ గ్రామానికి చెందిన జానమొల్ల పరశురాంగౌడ్ అక్రమంగా బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు దుకాణంపై దాడి చేసి రూ. 21 వేల విలువ చేసే మద్యాన్ని చేసి పరశురాంగౌడ్‌పై కేసు నమోదు చేశారు.

వేర్వేరు చోట్ల ఏడుగురు అదృశ్యం

వేర్వేరు చోట్ల ఏడుగురు అదృశ్యమయ్యారు. శుక్రవారం ఒక్కరోజే పలు పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఈ కేసులు నమోదు కావడం విశేషం. ఇందులో ఇద్దరు మైనర్లు కాగా, ఒక యువకుడు, ముగ్గురు మహిళలు, మేస్త్రీ పని చేసే వ్యక్తి ఉన్నారు.


సాత్విక్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాలుడి తల్లి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సీతారాంపూర్ కాలనీకి చెందిన మమత కుమారుడు సాత్విక్ (9) పటాన్‌చెరు పట్టణంలోని ఓ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఏడు గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాత్విక్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు.తల్లి మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

బాలిక అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరుకు చెందిన మైనర్ (17) జనవరి 26వ తేదీన ఇంట్లో వాళ్లకు చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. కూతురు అదృశంపై తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండు నెలల తర్వాత కుమారుడు ఫిర్యాదు

తండ్రి అదృశ్యమయ్యాడని కుమారుడు ఫిర్యాదు చేసిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మారుతీనగర్ మార్కెట్ ప్రాంతానికి చెందిన నర్సింహారావు (47) సుమారు రెండు నెలల క్రితం మేస్త్రీ పని కోసం వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన నర్సింహా రావు కుమారుడు రమేష్ గురువారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


నర్సింహారావు (ఫైల్)

డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి..


చాహన్ రాహుల్

యువకుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పటాన్‌చెరు పట్టణంలోనే కటిక బస్తీకి చెందిన చాహన్ రాహుల్(24) పారిశ్రామికవాడలో ప్రైవేట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జనవరి 30వ తేదీన ఉదయం డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి లాల్ చాంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు చేసిన ఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రదీప్ భార్య మాయతో కలిసి బతుకుదెరువు కోసం రెండు నెలల క్రితం పటాన్‌చెరుకు వచ్చాడు. గ్రామ సమీపంలోని హాల్ మార్క్ కన్‌స్ట్రక్షన్ వద్ద కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం మాయ ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో భర్త చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భార్య అదృశ్యంపై శుక్రవారం బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాళ్లకల్‌లో వివాహిత..


లావణ్య (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): వివాహిత అదృశ్యమైన ఘటన మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దింటి శివరాజ్ భార్య లావణ్య(26) స్థానికంగా ఉన్న ఫ్యాన్ పరిశ్రమలో దినసరి కూలీగా పని చేస్తుంది. గత నెల 31వ తేదీన ఎప్పటిలాగే పనులకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం మామ యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణం సాయి కృపానగర్‌కు చెందిన చాకలి నర్సమ్మ (54) ఇంట్లో కుటుంబ గొడవలతో గురువారం ఉదయం వెళ్లిపోయి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త చాకలి జనార్ధన్ సంగారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ శ్రీధర్ రెడ్డి తెలిపారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ


మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: మహిళలు మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిద్దిపేట పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. శుక్రవారం సీపీ విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలోని షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు, సిబ్బంది జనవరిలో వివిధ పాఠశాలలు, కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మహిళలను ఎవరైనా ఆకతాయిలు వేధించినా, ఇతర వేధింపులకు గురి చేసినా డయల్ 100, షీటీమ్ వాట్సాప్ నంబర్ 87126 67434, స్నేహిత మహిళా సపోర్టు సెంటర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆన్‌లైన్ మోసాలు

పార్ట్ టైం ఉద్యోగాల పేరిట ఆన్‌లైన్ మోసాలు జరిగిన ఘటన కమిషనరేట్ పరిధిలో చోటు చేసుకుంది. పలు సైబర్ మోసాల వివరాలను సీపీ అనురాధ శుక్రవారం తెలిపారు. సిద్దిపేట వన్ టౌన్ పీఎస్ పరిధిలోని ఓ బాధితురాలికి గుర్తు తెలియని వ్యక్తి లోన్ యాప్ లింక్‌ను పంపాడు. ఆ లింక్‌ను ఓపెన్ చేసి తన వివరాలతోపాటు, బ్యాంకు వివరాలు నమోదు చేసింది. అనంతరం పలు దఫాలుగా రూ.18,200 పంపింది. తర్వాత ఆ లింక్ ఓపెన్ చేయగా బ్లాక్ చేసినట్లు వచ్చింది. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు వెంటనే 1930కి ఫిర్యాదు చేయగా పంపిన ఖాతాలో రూ.7,700 ఫ్రీజ్ చేశారు. అనంతరం సిద్దిపేట టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. కుకునూర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి పార్ట్ టైం జాబ్ లింక్‌ను పంపి టెలిగ్రాం యాప్ గ్రూప్‌లో యాడ్ చేశాడు. అందులో పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించాడు. అది నమ్మిన బాధితుడు రూ.4,48,663 పంపించాడు. తర్వాత ఆ లింకు బ్లాక్ చేసి ఉన్నట్లు గుర్తించి 1930కు ఫిర్యాదు చేశాడు. అలాగే అక్కన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో మరో వ్యక్తి రూ.1,33,000 పంపించి మోసపోయాడు. సైబర్ నేరగాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): నాటుసార సరఫరా, గుడుంబా తయారీ చేసే వారు ఎవరైనా వదిలిపెట్టమని పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ శాఖ సీఐ పవన్ హెచ్చరించారు. శుక్రవారం ఎక్సైజ్ శాఖ హుస్నాబాద్, టాస్‌ఫోర్స్ సిద్దిపేట, పోలీసులు అక్కన్నపేట కలిసి సంయుక్తంగా ఎక్సైజ్ ఎస్సై దామోదర్ ఆధ్వర్యంలో అక్కన్నపేట మండలంలోని పంతుల్‌తండా, పెద్దతండా, బోదర్‌వాగు తండా, చౌడుతండా, పలు తండాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. అనంతరం సీఐ పవన్ మాట్లాడుతూ రెండు నెలల వ్యవధిలో 13 కేసులు నమోదు చేసి, ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. 800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామని పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని బెల్లం వ్యాపారులకు సక్రమ పద్ధతుల్లో విక్రయాలు జరపాలని నోటీసులు అందజేశామన్నారు. 11 మందిని బైండోవర్ చేశామని, బైండోవర్ ఉల్లంఘించిన ఒకరికి రూ.50 వేల జరిమానా విధించామని గుర్తు చేశారు.

అదుపు తప్పి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి

బైక్ ప్రమాదంలో ఇద్దరు మృతి


ఆరిఫ్ మృతదేహం

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మండల కేంద్రం కొల్చారంలో శుక్రవారం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్‌ఐ గౌస్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ మహమ్మద్(50), అదే గ్రామానికి చెందిన ఆరిఫ్(55) కలిసి పనిపై కొడిపల్లికి బైక్‌పై వెళ్లారు. అక్కడ పని ముగించుకొన్న తిరుగు పయనమైయ్యారు. వీరి బైక్ మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారిపై మండల కేంద్రానికి సమీపంలో లోతువాగు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరిఫ్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన మహమ్మద్‌ను చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గౌస్ తెలిపారు. ఒకే వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

కల్వర్టును ఢీకొట్టిన బైక్

తీవ్ర గాయాలతో యువకుడు మృతి


ప్రమాద స్థలంలో శ్రీనివాస్ మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన బెజ్జంకి గుట్ట సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. బెజ్జంకి గ్రామానికి చెందిన బండిపెల్లి శ్రీనివాస్(25) గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. శుక్రవారం ఉదయం గ్రామ శివారులో కల్వర్టు వద్ద చనిపోయి ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వచ్చి పరిశీలించారు. గుండారం వైపు నుంచి బైక్‌పై గ్రామానికి వస్తుండగా ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పరుశరాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య రజిత, కూతురు ఉన్నారు.

బొలేరో వాహనం ఢీకొని..


మధు మృతదేహం

జోగిపేట(అందోల్): బొలేరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం జోగిపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ కథనం మేరకు.. జోగిపేట పట్టణానికి చెందిన సావిడి మధు (40), మరో ఇద్దరితో కలిసి బైక్‌పై చింతకుంట నుంచి జోగిపేటకు వస్తున్నాడు. భారత్ పెట్రోల్ పంప్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో బొలేరో వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో మధు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుటుంబీకులు, స్నేహితులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన సంగమేశ్వర్ అనే వ్యక్తిపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

టైలర్ షాప్‌లో అగ్ని ప్రమాదం


పరిశీలిస్తున్న ఫైర్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: టైలర్ షాప్‌లో స్వల్ప అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పటేల్‌పూరలో ఉస్మాన్‌అలీ టైలర్ షాపును నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం రాత్రి షాప్ మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం తెల్లవారుజామున టైలర్ షాపులో నుంచి పొగలు రావడాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారు నిర్వాహకుడు అలీకి సమాచారం ఇచ్చారు. బాధితుడు వచ్చేసరికి టైలర్ షాపులో మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు.

రెండు ఇళ్లలో చోరీ


చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

కొండపాక(గజ్వేల్): రెండు ఇళ్లలో చోరీ ఘటన మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన సున్నం రాజయ్య బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లగా, దొంగలు చోరీకి పాల్పడి ఇంట్లోని రూ.1,50,000 నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, గ్రామానికి చెందిన వడ్ల సత్తవ్వ వేరే గ్రామానికి వెళ్లగా ఇంట్లో దొంగలు పడి 3 తులాల బంగారం ఖరీదైన బట్టలను ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇళ్లకు తాళాలు తీసి ఉండడంతో చుట్టుపక్కల వారు గమనించి బాధితులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి పోలీసులు తెలిపారు.